
# నేస్తం! నన్నర్థం చేసుకోవూ! -జాబిలి

ప్రియమైన మానసా!

నా మనసును దోచిన ఓ నెచ్చెలీ! నా ఈ ఉత్తరం చూసి ఆశ్చర్యపోతున్నావా? నిజానికి రోజూ గంటల తరబడి కాలేజీలోనో, లైబ్రరీలోనో, ఫోన్‌లోనో మాట్లాడుకొనే మనకు ఉత్తరాలు రాసుకొనే అవసరం ఎంత మాత్రం లేదు.

నీతో ఎంతసేపు మాట్లాడినా తనివి తీరని నేను-నీవే నా జీవిత భాగస్వామివి కావాలని మనసారా కోరుకొనే నేను - ఈ విషయం నీకు తెలియజేయాలని ఎన్నోసార్లు అనుకొని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాను



ఇప్పటికైనా నా ఆలోచనను అక్షర రూపంలో ఉంచ కున్నందుకు ఒకవైపు ఆనందంగానూ, మరోవైపు నీ నుండి ఎలాంటి ప్రతిస్పందన ఉంటుందోనని ఆందోళనగానూ ఉంది.

అనాటమీ నుండి- అణు పరీక్షల వరకూ అరమరికల లేకుండా మాట్లాడుకొనే మనం, మన జీవితాలకి సంబంధించిన అతి ముఖ్యమైన నిర్ణయం-అదే వివాహాని సంబంధించిన నిర్ణయం తీసుకోవటాని తటపటాయించడం చిత్రంగా లేదూ!

అయితే బహశా ఎటువంటి సమాధానం వినవల వస్తుందోనన్న భయంవల్ల మనం, ఆ విషయాన్ని ఎప్పుడ చర్చించలేదనుకుంటాను.

ఇప్పుడయినా ఈ విషయం ప్రస్తావించటానికి ఒ కారణముంది.

నిన్న రాత్రి భోజనాల వద్ద అమ్మ నాన్నగారిత మాట్లాడుతూ "అబ్బాయి చదువూ అయిపోయింది ఉద్యోగమూ వచ్చింది. ఇక పెళ్ళికెందుకు ఆలస్యం కుందనపు బొమ్మలాంటి మానసయితే మనబ్బాయి! ఈడూ-జోడూగా ఉంటుంది. అటు అందం ఇటు చదువ రెండూ ఉన్నాయి. అమ్మాయికీ, అబ్బాయికీ నచ్చితే ఆ పెళ్ళి కాస్తా అయిందనిపిస్తే మనకి నిశ్చింత!"అంది.

నాన్నగారు కూడా సరేనన్నారు. ఇంకా వాళ్ళు ఇక్కడ మన పెళ్ళయ్యాక నర్సింగ్ హోమ్ కట్టించే విషయం కూడా ఆలోచిస్తున్నారు.

ఈ విషయంలో మరి నీ అభిప్రాయమేమిటో నాకు తెలీదు. పైగా నీవేమో మొన్నోసారి మాటల సందర్భంలో "ఉమ్మడి కుటుంబాల్లోకంటే వ్యష్టి కుటుంబాల్లోనే వ్యక్తులకు స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది"అనటంవల్ల నాకీ ఉత్తరం రాయక తప్పిందికాదు.

నీకూ, మీ వాళ్ళకూ నేను నచ్చితే, మనం పెళ్ళి చేసుకొందాం.

అయితే మా అమ్మా నాన్నా, పెళ్ళయ్యాక మనతోనే ఉంటారు.

నీకు తెలుసు వాళ్ళకు నేనొక్కడినే సంతానం. పెళ్ళయ్యాక భార్య మాటలు విని తల్లిదండ్రులను భారంగా తలచి, వారిని దూరంగా ఉంచి, నెలకింత డబ్బు పంపించి, బాధ్యత తీరిందనుకొని వాళ్ళను అప్పుడప్పుడు పలకరించే గెస్టు పాత్ర నేను నిర్వహించలేను.

తల్లిదండ్రులను అలా చూసే కొడుకులన్నా నాకేమాత్రం సదభిప్రాయం లేదు. నిజానికి నా తల్లిదండ్రులు నాతో ఉండటం నాకిష్టం లేదని తెలిసిన మరుక్షణం నాకు దూరంగా వెళ్ళిపోతారు. సర్వదా నా సుఖాన్ని కాంక్షించే వాళ్ళు... మరో మాట మాట్లాడకుండా వెళ్ళిపోతారు.

అది మనకు ఆనందాన్నిస్తుందా? అది కన్న కొడుకు చేయవలసిన పనేనా! అదేనా కొడుకులు నేర్చుకున్నది.? నన్ను కని పెంచి. పెద్దచేసి. విద్యాబుద్ధులు చెప్పించిన నా తల్లిదండ్రులకు కొడుకుగా నేను చేయవలసిందిదేనా?

జీవితంలో ఎన్నో కష్టనష్టాలకోర్చి. తాము కరిగిపోయినా. తమ బిడ్డలు సుఖంగా. సంతోషంగా నూరేళ్ళూ బ్రతకాలని కోరుకునే తల్లిదండ్రుల్లో బహుశా మా అమ్మా నాన్నా ముందుంటారేమో!

బిడ్డల వద్దనుండి ఏదో ఆశించి. తల్లిదండ్రులు పిల్లలను పెంచరు. అలాగని పిల్లలు తమ కర్తవ్యాన్ని మర్చిపోకూడదు. వృద్ధాప్యంలో వారికి అండగా ఉండి వారి అవసరాలు చూడాలి.

నాకు చిన్నప్పటినుండీ తల్లిదండ్రులను సేవించి తరించిన రాముడి. శ్రావణుడి. పుండరీకుడి కథలంటే చెప్పలేనంత ఇష్టం.

మా అమ్మా, నాన్నమ్మ చెప్పిన కథలు నన్నెంతో ప్రభావితం చేశాయి. వాళ్ళలాగే నేనూ నా తల్లిదండ్రులను గౌరవించాలనీ. ప్రేమించాలనీ చిన్నప్పుడే నిశ్చయించుకొన్నాను. అది నెరవేరాలంటే మరి నా జీవితంలో పాలు పంచుకునే నీ సహకారం కూడా కావాలి కదా!

అలాగని నువ్వు వారికేమీ సేవలు చేయాల్సిన అవసరం లేదు. ఇంట్లో చాలామంది పనివాళ్ళున్నారు. వాళ్ళే వాళ్ళ వసరాలు చూస్తారు. ఇంకా నేనున్నాను వారిని చూసుకోవటానికి.

జీవితపు చరమాంకంలోనున్న వారికి ఇప్పుడు కావలసింది తమ పిల్లల ప్రేమ- ఆదరణ- ఆప్యాయత. తాము తమ పిల్లల వద్ద ఉన్నామన్న భావనే వారికెంతో తృప్తినిస్తుంది. పైగా మనమిద్దరం డాక్టర్లం. ఇటు పెద్దవాళ్ళయిన నా తల్లిదండ్రులను చూసుకొంటూ అటు పేదవారికి వైద్యం చేస్తే మన జీవితాలు ధన్యమైనట్లే!

మనకు కావలసినంత డబ్బుంది. డబ్బు సంపాదించాల్సిన అవసరమూ లేదు. చల్లని. ఆప్యాయతతో కూడిన నీ పలకరింపే మా అమ్మా నాన్నలకు అమృతంలా పనిచేస్తుంది.

నువ్వు పెరిగిన వాతావరణం ఇందుకు భిన్నంగా ఉంది. స్వేచ్ఛగా, ఏ బాధ్యతలు లేకుండా పెరిగిన నీకు ఇది వింతగా కనిపించవచ్చు. నన్ను నీవు ఎలా భావించినా. సెంటిమెంటల్ అనుకున్నా ఫరవాలేదు. నా భావాలను నీ ముందుంచుతాను.

నీకు ఒక విషయం చెప్పడం మరిచాను. మా అమ్మ ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యింది. తాను ఉద్యోగంలో ఉన్నప్పుడు ఎందరో ఆడపిల్లలకు ఎన్నోరకాలుగా సహాయం చేసింది. వాళ్ళిప్పటికీ అమ్మ దగ్గరకు వస్తూంటారు. సలహాలను తీసుకొంటుంటారు.

తాను నమ్మిన ఆశయాలకోసం మిలిటరీలో చేరినా, మిలిటరీనుండి రిటైరయ్యాక కూడా తన కర్తవ్యాన్ని మర్చిపోక అటు సమాజ సేవ చేస్తూ. ఇటు వ్యాపారమూ చేస్తూ పేరు ప్రఖ్యాతులు గడించారు నాన్న.

క్రమశిక్షణకు ప్రాణం పెట్టే మనిషి. అయినా నాన్నకు తన సిద్ధాంతాలను ఎవరిపైనా రుద్దే అలవాటు లేదు. నా చిన్నప్పుడే మా నాన్న ఆర్మీలో చేరటంతో నా బాల్యమంతా అమ్మా, నాన్నమ్మల ఒడిలోనే గడిచింది.

తోబుట్టువులు లేని నాకు అమ్మే అన్నీ అయి పెంచింది. అమ్మ నాకు స్నేహితురాలుగా ఎన్నో విషయాలు చెప్పేది. నేను ఎలా ఉండాలో తెలియ చెప్పేది. నాకు తెలిసినంతవరకు అమ్మ ఎవరినీ నొప్పించగా నేను చూడలేదు.

మా అమ్మా, నాన్నమ్మ తల్లీ కూతుళ్లలా కలిసి మెలిసి ఉండేవారు. ఇప్పుడు కూడా మా అమ్మా, నాన్నా మన స్వేచ్ఛకు ఎంత మాత్రం అడ్డురారు! మనకెలాంటి ఇబ్బందీ కలిగించరు.

చిన్నప్పుడు నేను ఏదడిగినా. క్షణాల్లో అమర్చిపెట్టేవారు. నన్ను ఓ రాకుమారుడిలా పెంచారు.

అలాగే నేను కోరుకున్న నీవంటే కూడా వారికెంతో ఇష్టం. నిన్నెంతో అపురూపంగా చూసుకుంటారు. అమ్మ నిన్ను తన కూతుర్లా ఆదరిస్తుంది. అందులో ఏ మాత్రం సందేహం లేదు. అమ్మ అప్పుడే రాబోయే కోడలికోసం అంటూ ఎన్నో నగలను చేయించి నీరాక కోసం ఎదురు చూస్తోంది.

మూడేళ్ళ క్రితం అనాటమీ లాబ్‌లో పరిచయమయిన క్షణంలోనే నీవు నామనస్సునాక్రమించావు. నాతో పోటీపడి, నాకు ధీటుగా నువ్వు చేసిన ప్రాక్టికల్స్ నన్నెంతో ముగ్ధుణ్ణి చేశాయి.

నీ తెలివితేటలు, చిలిపిదనం, అందం నన్ను కట్టివేశాయి. ఆ క్షణంలోనే అనుకొన్నాను నీవే నాకు సరయిన జీవిత భాగస్వామివని.

తోబుట్టువులు లేని నేను ఆడపిల్లలను సొంత చెల్లెళ్ళుగా భావించే వాణ్ణి. అలాంటి నన్ను మరి నీవు దోచుకున్నావు- భావుకుణ్ణి చేశావు.


ఇదంతా నీకు ఎందుకు రాస్తున్నానంటే పెళ్ళికి ముందు మా వాళ్ళను గురించిన అపోహలు నీకేమయినా ఉంటే వాటిని తొలగిద్దామన్న ఉద్దేశంతో తప్ప మరేమీకాదు.

ఒకవేళ నీకు గాని, మీ తల్లిదండ్రులకు గాని నా ప్రతిపాదన నచ్చని పక్షంలో ఆ విషయం నిరభ్యంతరంగా, సూటిగా చెప్పు. నేనేం అనుకోను, మనం మంచి స్నేహితులుగా మిగిలిపోదాం!

ఒక్క విషయం నిన్ను నేను పెళ్ళి చేసుకోలేనట్లయితే జీవితాంతం అవివాహితుడిగానే ఉండిపోతాను! నీ ఊహల్లోనే జీవిస్తాను. మరెవరినీ నా జీవితంలోకి ఆహ్వానించను. మరి నీ సమాధానానికై వేయి కళ్ళతో ఎదురు చూస్తూ-

నీ వాడిని కావాలని మనసారా కోరుకునే
-నీ అభిమన్యు.

జాబిలి,
ఇంటి నెం.1-8-155, బాలసముద్రం,
హన్మకొండ-506 001.



కాటుబోయిన అమన్‌రవి, కేరాఫ్: ఎం. సుధాకర్, శ్రీ కృష్ణారైస్‌మిల్, పాతకడప, జిల్లా: కడప.